



విశాఖ నుంచి బయల్దేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో చిన్నారులు



విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్

పట్టాలెక్కిన మరో 2 వందే భారత్ రైళ్లు

భువనేశ్వర్‌కు ఒకటి, సికింద్రాబాద్‌కు మరొకటి

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి కొత్తగా రెండు వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. వీటిలో ఒకటి ఉదయం తొమ్మిది గంటలకు విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు బయలుదేరి వెళ్లింది. ఈ రైలు ఈ నెల 17వ తేదీ నుంచి రెగ్యులర్‌గా నడుస్తుంది. మరో రైలు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రికి విశాఖపట్నం చేరింది. దీనికి స్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ రైలు బుధవారం నుంచే రెగ్యులర్‌గా నడుస్తుంది. వీటితో పాటు వాల్తేరు డివిజన్‌లో పూర్తయిన డబ్లింగ్ పనులను, మూడో లైన్ పనులను కూడా ప్రధాని మోదీ ప్రారంభించి జాతికి అంకితం ఇచ్చారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైళ్ల ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని పద్మ అవార్డు గ్రహీతలు డాక్టర్ సుంకర ఆదినారాయణరావు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ అధ్యక్షత వహించగా ... మిగతా 6వ పేజీలో



సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చిన వందేభారత్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న రైల్వే అధికారులు, ప్రయాణికులు

మహా విచిత్రం

- వార్డుల్లో చేపట్టే పనులకు చిల్డ్రన్ ఎరీనాలో నేడు మేయర్ శంకుస్థాపన
- జీవీఎంసీ పాలకుల నిర్ణయంపై విమర్శలు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పాలకులు తీసుకుంటున్న పలు నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జోన్-2, జోన్-3 పరిధిలో రూ.22.38 కోట్లతో చేపట్టనున్న పనులకు సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేయాలని నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. రెండు జోన్ల పరిధిలో...ఆయా వార్డులకు మేయర్ వెళ్లి శంకుస్థాపన చేసేందుకు గరిష్ఠంగా రెండు గంటలు సమయం పడుతుంది. అయినప్పటికీ అలా చేయకుండా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇండోర్ ఆడిటోరియంలో శంకుస్థాపన శిలాఫలకాలు ఆవిష్కరించేందుకు సిద్ధం కావడంపై కార్పొరేటర్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. మేయర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైసీపీ నేతలు, పాలకవర్గం పెద్దలు ఎన్నికల వేళ ప్రజల్లో మెహర్బానీ కోసమే ఇలాంటి పనులు చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ... మిగతా 6వ పేజీలో

సంక్షోభంలో ఉక్కు

పడిపోయిన ఉత్పత్తి

- మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభించినా ప్రయోజనం శూన్యం
- అధికారులకు ఇంకా అందని జీతాలు
- ఎప్పుడు ఇస్తామో చెప్పలేమన్న సీఎండీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేయబోమని, ఆదుకుంటామని బీజేపీ నాయకులు చెబుతుంటే...మరోవైపు యాజమాన్యం ప్లాంటును మూసివేత దిశగా తీసుకువెళుతోంది. అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని పైకి చెబుతున్నప్పటికీ లోపల మాత్రం ఆర్థికంగా కుదేలయ్యేలా చేస్తున్నారు. ముడి పదార్థాల కొనుగోలుకు నిధులు లేక ఒక బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)ను రెండేళ్లు మూసేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సీఎండీ జిందాల్ స్టీల్ నుంచి ఆర్థిక సాయం తీసుకొని గత డిసెంబరులో దానిని వినియోగంలోకి తీసుకువచ్చారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పని చేస్తున్నాయని, ఇక తిరుగులేదని అన్నారు. కానీ ఉత్పత్తి చూస్తే ఆశాజనకంగా లేదు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లతో రోజుకు సగటున 21 వేల టన్నులు ఉత్పత్తి చేయవచ్చు. కానీ మూడింటికి సరిపడా ముడి పదార్థాలు లేకపోవడంతో వారంలో మూడు, నాలుగు రోజులు ఏదో ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను డౌన్ చేస్తున్నారు. అలాగని మిగిలిన రెండింటిలోను పూర్తి ఉత్పత్తి జరుగుతుందా?...అంటే అదీ లేదు. గత ఫిబ్రవరి



నెలలో సగటున రోజుకు 14,086 టన్నులు ఉత్పత్తి చేశారు. అంటే 2/3 వంతు మాత్రమే ఉత్పత్తి తీశారు. ఇప్పుడు మార్చి నెలలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మార్చి 11వ తేదీ వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం రోజుకు 21వేల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉండగా...12,559 టన్నులు మాత్రమే అవుతోంది. అంటే గత నెల కంటే ఉత్పత్తి ఇంకా పడిపోయింది. బ్లాస్ట్ ఫర్నేస్-2ను తాత్కాలికంగా షట్‌డౌన్ చేశారు. ఈ 11 రోజుల్లో ఇప్పటివరకు 1,38,150 టన్నులు మాత్రమే ఉత్పత్తి వచ్చింది. వాస్తవిక సామర్థ్యం ప్రకారం 2.31 లక్షల టన్నులు రావాలి. కానీ లక్ష టన్నులు తక్కువగా చేశారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నెలలో ఎక్కువ ఉత్పత్తి చేసి, అమ్మకాలు కూడా ఎక్కువగా చేస్తారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిందాల్ చేసిన ఆర్థిక సాయం కూడా బూడిదలో పోసిన పన్నీరైంది.

ఎగ్జిక్యూటివ్‌లకు ఇప్పటికీ జీతాలు లేవు

ఫిబ్రవరి నెల జీతాలు 12వ తేదీ ముగిసినా ఇప్పటికీ ఎగ్జిక్యూటివ్‌లకు ఇవ్వలేదు. సుమారు రూ.40 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అధికారులు అంతా సీఎండీని కలిసి జీతాలు ఎప్పుడు ఇస్తారని మంగళవారం అడిగితే...బ్యాంకులకు వడ్డీలు కట్టాల్సి ఉందని సమాధానం చెప్పారే తప్ప ఫలానా తేదీన ఇస్తామని గ్యారెంటీ ఇవ్వలేదు. అంటే ఈ నెల జీతాల కోసం ఎదురు చూడవద్దని సూచన చేసినట్టుగా ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. స్టీల్‌ప్లాంటుని గట్టెక్కిస్తున్నామని బయట ప్రచారం చేస్తూ లోపల మాత్రం దానిని ఆర్థికంగా దివాళా తీయిస్తున్నారు. ఉద్యోగులు, కార్మికుల పనితీరు బాగా లేకపోవడం వల్లే జరిగిందని ప్రచారం చేసి ప్రైవేటుకు అప్పగించేందుకు దొడ్డిదారిన కుట్ర చేస్తున్నారు.

ఉచిత సీట్లపై విద్యాశాఖ గోప్యత

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు కళాశాలల్లో పేదలకు కేటాయించిన సీట్ల వివరాలు ఎందుకు వెల్లడించడం లేదు

- జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల నిలదీత
- అక్రమ గ్రావెల్, ఇసుక తవ్వకాలను అడ్డుకోకపోవడంపై అసంతృప్తి
- శిథిలావస్థకు చేరిన రహదారులను బాగుచేయాల్సిందిగా వినతి
- నిధుల కొరత ఉందన్న రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ
- ఏ సమస్య చెప్పినా నిధులు లేవంటున్నారని కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో పోలినాయుడు. పక్కన వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం...అందుకు సంబంధించిన వివరాలను ఎందుకు వెల్లడించడం లేదని భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ప్రశ్నించారు. మంగళవారం జడ్పీ వైస్ చైర్మన్ బీవీ సత్యవతి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. రెండో స్థాయీ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీట్ల వ్యవహారంలో విద్యా శాఖ గోప్యత పాటిస్తోందని ధ్వజమెత్తారు. భీమిలి పట్టణంలో దశాబ్దాల క్రితం ప్రారంభించిన సెయింట్స్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలను మూసివేయాలని యాజమాన్యం తీసుకున్న నిర్ణయంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఆ పాఠశాలను కొనసాగించేందుకు విద్యా శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. చీడికాడ జడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదా వరలక్ష్మి మాట్లాడుతూ తమ మండలంలోని వీరభద్రపేట పాఠశాలలో వసతులు లేవని, గుడివాడలో పాఠశాల ప్రహరీ నిర్మించాలని కోరగా అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ నగరంలో ప్రైవేటు లేబొరేటరీలు వైద్య పరీక్షల పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నాయని ఫిర్యాదు చేశారు. అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగంలో వైద్యం అందడంలో జాప్యం జరుగుతుందని వైస్ చైర్మన్ సత్యవతి ఫిర్యాదు చేశారు.

ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ చినగుమ్ములూరులో ఉపాధి పథకం పనులు చేసే వారికి కూలి రేట్లలో కోత విధిస్తున్నారని ఫిర్యాదు చేయగా...చర్యలు తీసుకుంటామని సీఈవో పోలినాయుడు తెలిపారు. పరవాడ మండలంలో ఎన్టీపీసీ నుంచి అపరిమిత బరువుతో ఫ్లైయాష్ లారీలు తిరుగుతుండడంతో రోడ్లు శిథిలావస్థకు చేరాయని జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆరోపించారు. అలాగే పోర్టు నుంచి హిందూజా కంపెనీకి బొగ్గు రవాణా చేసే లారీలు 30 నుంచి 40 టన్నుల బరువుతో వస్తున్నాయన్నారు. లారీలపై టార్పాలిన్లు లేకపోవడంతో ఫ్లైయాష్, బొగ్గు ధూళి ఎగిరి దారిపొడవునా పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి మాట్లాడుతూ అడ్డరోడ్డు నుంచి మాకవరపాలెం వైపు భారీ లారీలు పరిమితికి ... మిగతా 6వ పేజీలో

30 మంది ఎంపీడీవోలకు షోకాజ్

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో జాప్యం

- పది రోజుల్లో వివరణ కోరిన జడ్పీ సీఈవో

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయడంలో జాప్యం చేసినందుకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 30 మంది ఎంపీడీవోలకు జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు వారం క్రితం షోకాజ్ జారీచేశారు. మరికొద్దిరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్నది. అయితే కేవలం తొమ్మిది మండలాల్లో మాత్రమే 50 శాతం మేర పనులు కాగా మిగిలిన 30 మండలాల్లో అంతకంటే తక్కువ అయ్యాయి. దీంతో ఎంపీడీవోలకు షోకాజ్ జారీచేసిన సీఈవో, పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ విషయాన్ని మంగళవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతి మండలానికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు విడుదల చేశారు. ఇంకా జడ్పీకి వచ్చిన వాటా నుంచి ప్రతి మండలానికి సగటున రూ.20 లక్షల వరకు కేటాయించారు. ఈ నిధులతో ఆయా మండలాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు సూచించిన మేరకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పనులు చేపట్టాలి. కానీ, పంచాయతీరాజ్ ఇంజనీర్లు తీవ్ర నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు కావడం లేదన్న కారణంగా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు బడ్జెట్ ఉందని పదేపదే చెబుతున్నా మండల స్థాయిలో ఇంజనీర్లు బాధ్యత తీసుకోవడం లేదని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈవో ఇటీవల మండల స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పనులు వేగవంతం చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. దీంతో తొలుత ఎంపీడీవోలకు షోకాజ్ ఇచ్చారు.

స్టాండింగ్ కమిటీ సమావేశాలకు కోరం గండం

ఇదిలావుండగా మంగళవారం జడ్పీ హాలులో జరిగిన స్టాండింగ్ కమిటీ ... మిగతా 6వ పేజీలో

గాజువాక వైసీపీలో గందరగోళం

మరోమారు సమన్వయకర్త మార్పు

- సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడిని కాదని మొదట ఉరుకూటి రామచంద్రరావు నియామకం
- ఇప్పుడు అతని స్థానంలో మంత్రి గుడివాడ అమర్...
- నాగిరెడ్డి, రామచంద్రరావు వర్గీయుల మధ్య గొడవల నేపథ్యంలోనే ఇన్‌చార్జి మార్పు



గుడివాడ అమర్‌నాథ్ | తిప్పల నాగిరెడ్డి | ఉరుకూటి రామచంద్రరావు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా ఉరుకూటి రామచంద్రరావు స్థానంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మంగళవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించింది.

గుడివాడ అమర్‌నాథ్ 2019 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసి గెలుపొందారు. రెండేళ్ల కిందట పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే నెల కిందట అనకాపల్లి సమన్వయకర్తగా మలసాల భరత్‌ను అధిష్ఠానం నియమించడంతో అమర్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే చర్చ మొదలైంది. పెందుర్తి, గాజువాక, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో...ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని అమర్ భావించారు. అయితే చోడవరం, ఎలమంచిలి సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమకు కాకుండా అమర్‌కు టికెట్ ఇస్తే సహకరించేది లేదని అధిష్ఠానానికి తేల్చిచెప్పారు. దీంతో పెందుర్తి, గాజువాక సీట్లపై అమర్ ఆశ పెట్టుకున్నారు. కానీ సర్వేల ఆధారంగా అధిష్ఠానం గాజువాక సమన్వయకర్తగా ఉరుకూటి చందూను నియమించింది. ఇదే సమయంలో అమర్‌నాథ్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పార్టీ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా నియమించడంతో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దాదాపు లభించదనే అంతా అనుకున్నారు. అయితే గాజువాకలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, సమన్వయకర్తగా నియమితుడైన ఉరుకూటి చందూకు మధ్య పొసగపోవడంతో మంత్రి అమర్‌నాథ్‌ను గాజువాక సమన్వయకర్తగా నియమించాల్సిన పరిస్థితి అధిష్ఠానానికి ఏర్పడింది.

2019 ఎన్నికల తర్వాత గాజువాక నియోజకవర్గం సమన్వయకర్తగా సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు దేవన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. రెండు నెలల కిందట దేవన్‌రెడ్డిని సమన్వయకర్త బాధ్యతల నుంచి తొలగించి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు(చందు)ను అధిష్ఠానం నియమించింది. వచ్చే ఎన్నికల్లో ఉరుకూటి రామచంద్రరావే గాజువాక నుంచి పోటీ చేస్తారని పార్టీలో ప్రచారం జరిగింది. దీనిపై సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితోపాటు ఆయన కుమారుడు దేవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అధిష్ఠానం నాగిరెడ్డితో పాటు అతని ఇద్దరు కుమారులను విజయవాడ పిలిచి బుజ్జగించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో గాజువాకలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీసుబ్బారెడ్డి హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఉరుకూటి చందుయే గాజువాక అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆ మరుసటిరోజు అనుచరులతో సమావేశమై ఉరుకూటి చందు అభ్యర్థిత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. చందూకు తప్ప వేరెవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. ఒకవేళ గాజువాక సీటుని యాదవ సామాజిక వర్గానికే కేటాయించాలనుకుంటే జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి ... మిగతా 6వ పేజీలో

ఎమ్మెల్యే వెలగపూడి ఓటరు కార్డులో తప్పులు

ఎన్నికల ప్రధాన అధికారి, జేసీకి ఫిర్యాదు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ నంబరు బీజీవై 3267739)లో తప్పు దొర్లింది. ఎమ్మెల్యే ఎంవీపీ కాలనీలోని సెక్టార్-5 (డోర్ నంబర్ 1-93-11/2)లో నివాసం ఉంటున్నారు. అదే అడ్రస్‌తో ఆయనకు గతంలో ఓటరు కార్డు జారీ అయింది. ఇటీవల ఆయన ఓటరు గుర్తింపు కార్డు డౌన్‌లోడ్ చేసుకోగా...దానిపై ఇంటి నంబరు 1-93-11/2, సెక్టార్-4, సీతమ్మధార, విశాఖపట్నం-17, ఆంధ్రప్రదేశ్ అని ముద్రించి ఉంది. అయితే ఓటు మాత్రం గతంలో మాదిరిగా ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో గిరిజన భవన్‌లో ఉన్నట్టు పేర్కొని ఉంది. ఒక్క వెలగపూడికే కాకుండా విశాఖ తూర్పు నియోజకవర్గంలో కొత్తగా కార్డు డౌన్‌లోడ్ చేసుకుంటున్న అనేక మందికి ఇంటి నంబరు, వీధితోపాటు సీతమ్మధార అని ముద్రించి ఉండడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎవరైనా కొత్తగా ఓటరుగా నమోదైతే మాత్రం దరఖాస్తులో పేర్కొన్న అడ్రస్ మేరకు కార్డు జారీ అవుతుంది. ఓటరు కార్డులో తప్పులపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, విశాఖ తూర్పు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వెలగపూడి ఫిర్యాదు చేశారు.



వెలగపూడి ఓటరు కార్డుపై అడ్రస్ సీతమ్మధార అని ఉంది

అర్థమయ్యేలా బోధనను అందించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి

డాబాగార్డెన్స్, మార్చి 12: అధ్యాపకులు వినూత్న రీతిలో అర్థమయ్యేలా బోధించేందుకు నిరంతరం కృషి చేయాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై. లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సింగిల్ మేజర్ సబ్జెక్టులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జూవాలజీ, బయోలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి జిల్లాలోని అధ్యాపకులకు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు నూతన విద్యావిధానం, పరిశోధనలు సంబంధించిన నూతన పోకడలను తెలుసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డా.శిరీష, ఎస్.లావణ్య, టి.శ్యామూల్ డేవిడ్‌రాజ్, కె.రేఖ, డి.ప్రజ్ఞ , అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ



మెటీరియల్ అందిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

అక్కయ్యపాలెం, మార్చి 12 : తమ్మినేని ఇందువతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమైనవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు రాస్తున్న రెండువేల మంది విద్యార్థులకు ట్రస్ట్ సమకూర్చిన పరీక్ష అట్టలు, పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ కార్యక్రమాన్ని ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ శాసనసభ తమ్మినేని సీతారాం మాతృమూర్తి ఇందువతమ్మ పేరిటఅందిస్తున్న సేవలను కొనియాడారు. అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్ మాట్లాడుతూవిద్యార్థులు ఒత్తిడి లేని విధంగా పరీక్షలు రాయాలని సూచించారు.హెచ్‌ఎం బి.లక్ష్మీనరస, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రమణకుమారి, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకుంతల, నగర కన్వీనర్ కె.ఎల్లయ్య, లవకుశ, ఎం.హరీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈద్ పార్కు విస్తరణ స్థలం కోసం వినతి

జగదాంబ కూడలి, మార్చి 12: గ్రేటర్ 39 వార్డు పరిధిలోని ఈద్ పార్కు విస్తరణకు సమీపాన ఉన్న పోర్టు ట్రస్ట్ ఆధీనంలో ఉన్న 15 అడుగుల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శరణ్‌మసీదు కమిటీ ప్రతినిధులు పోర్టు ట్రస్ట్ చైర్మన్ అంగముత్తుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పోర్టు చైర్మన్‌కు మసీద్ కమిటీ, కోటవీధి ప్రాంత ముస్లింలు ఈద్ పార్కు విస్తరించడంతో రంజాన్ మాసం సందర్భంగా సామూహిక నమాజ్‌కు అ నుకూలంగా ఉంటుందని వివరించారు. జీవీఎంసీ ఈద్ పార్కు విస్తరణకు అనుమతించిందన్నారు. ఈస్థితిలో పోర్టు ఆధీనంలో ఉన్న స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పం దించినట్లు మసీద్ కమిటీ ప్రదినిధులు గఫూర్ వెల్లడించారు.

నేటినుంచి
డయల్ యువర్ కలెక్టర్ ఓటరు హెల్ప్‌లైన్

మహారాణిపేట, మార్చి 12: ఈనెల 13వ తేదీ నుంచి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు డయల్ యువర్ కలెక్టర్ ద్వారా ఓటర్ హెల్ప్‌లైన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు ప్రజల నుంచి ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఓటు నమోదు, ఓటరు గుర్తింపు కార్డు పోలింగ్ స్టేషన్ వివరాలకు, చిరునామాలు మార్పు తదితర సందేహాలపై సమాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫోన్: 0891-2590100 నంబరుకు ప్రజలు నేరుగా కలెక్టర్‌తో మాట్లాడవచ్చు.

మండుటెండలో రేషన్ కోసం పడిగాపులు



చిట్టిబాబుకాలనీ దగ్గర ఎండల్లో నిలుచున్న లబ్దిదారులు

మురళీనగర్, మార్చి 12; ఇళ్ల వద్దకే రేషన్ సరుకుల పంపిణీ అంటూ వైసీపీ ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో జనాలకు అగచాట్లు తప్పడంలేదు. మంగళవారం ఆర్‌అండ్‌బీ జంక్షన్ చిట్టిబాబుకాలనీ దగ్గర ఎండలో మహిళలు నిల్చుని రేషన్ బియ్యం విడిపించారు. గత టీడీపీ హయాంలో రేషన్ డిపోల్లో ప్రతినెలా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ సరుకులు పంపిణీ జరిగేది. కానీ ప్రస్తుతం ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తున్నాజనాలకు ఇబ్బందులు తప్పడంలేదు. మండుటెండలో నిల్చోవాల్సి వస్తోంది. వీధుల్లో వాహనాలను నిలిపి సరుకులను అందిస్తున్నారు. అదీ ఏ శివారునో సైరన్ మోగుతుంది. అది వినిపించకుంటే సరుకులకు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి వలంటీర్లతో కార్డుదారులకు సమాచారమిచ్చినా వాహనం రాకలో ఆలస్యమవుతోంది. సరుకుల కోసం వీధుల్లో లబ్దిదారులు ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15 వ తేదీ వరకు తమ వీధిలోకి బండి ఎపుడు పెడతారోనని ఎదురు చూడటమే పనిగా మారింది. పనులకు వెళ్లిన వారి పరిస్థితి దారుణం. వాహనం కోసం తప్పనిసరిగా వేచిచూడాల్సి వస్తోంది. గతంలో దుకాణాల్లో పంపిణీ ఎప్పుడు కావల్సిస్తేఅప్పుడు రేషన్ తెచ్చుకునే వెసులుబాటు ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎండీయూలు, వలంటీర్లే సమయం నిర్ణయిస్తున్నారు.ఏ తేదీలో ఎక్కడ తీసుకోవాలో వారే చెబుతారు. ఈ తిరకాసు పంపిణీ బదులు రేషను దుకాణాల్లోనే సక్రమంగా పంపిణీ జరిగేలా చూస్తే మంచిదని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

'దక్షిణ' టికెట్ గండి బాబ్జీకే కేటాయించాలి'

మహారాణిపేట, మార్చి 12: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి గండిబాబ్జీకే పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించాలని తెలుగుయువత అధ్యక్షుడు తాతాజీ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లో నియోజకవర్గ పార్టీ నాయకులు సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం ప్రకటించిన తొలి జాబితాలోగండి బాబ్జీ పేరు లేకపోవటం బాధాకరమన్నారు. రెండవ లిస్టులో అయినా ఆయనకు టికెట్ ప్రకటించాలని కోరారు. కొన్ని నెలలుగా బాబ్జీ వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో ముందున్నారన్నారు. అయితే పొత్తులో భాగంగా జనసేన, బీజేపీలలో ఎవరికి దక్షిణ నియోజకవర్గ టికెట్ కేటాయిస్తే పార్టీ అధిష్టానం సూచనలను తప్పనిసరిగా శిరసావహిం చి పనిచేస్తామన్నారు. కూటమి అభ్యర్థి మెజారిటీతో గెలిపించి చంద్ర బాబుకు బహుమతిగా అందజేస్తామన్నారు.ఈ సమావేశంలో నాయ కులు పి.ఎం. రమణ, కేదారి లక్ష్మి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీఎల్ సహకారంతో ఉపకరణాల పంపిణీ



దివ్యాంగునికి వాహనాన్ని అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, మార్చి 12: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) సహకారంతో దివ్యాంగులకు మోటారైజ్డ్ వాహనాలను, వీల్‌చైర్‌లను పంపిణీ చేశారు. మంగళవారం కలె క్టరేట్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ మల్లికార్జున చేతుల మీదుగా సు మారు రూ. 42 లక్షల విలువైన 50 మోటారైజ్డ్ వాహనాలు , 200 వీల్ చైర్‌లను అం దజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఐదు నెలల్లో ఐఓసీఎల్ సహకారంతో, సుమారు రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేసట్టినట్లు తెలిపారు. సంస్థ అందిస్తున్న సేవలకు అభినందనలు తెలిపారు. ఈసమావేశంలో దివ్యాంగుల సంస్థ సహాయ సంచాలకులు మాధవి, ఐఓసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి. సుధాకర్, మేనేజర్లు సత్యనారాయణ, పి శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వేధింపులు నిరోధించాలి



గీతాంజలి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన

రామ్‌నగర్, మార్చి 12: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారణమైన వైసీపీ సోషల్ మీడియాకు చెందిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, రాష్ట్ర స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షోషల్ మీడియా వేధింపులతో మృతిచెందిన గీతాంజలి కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. 20 లక్షలు కాకుండా, కోటి రూపాయలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సోషల్ మీడియాలో అశ్లీల పోస్టింగ్‌లను నిరోధించాలని కోరారు. సోషల్ మీడియా మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అసత్య ప్రచారాలు మానుకోవాలని కోరారు.బీసీ సంక్షేమ సంఘం నాయకులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 12: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, ఎన్‌జీజీఓస్ కాలనీ, గ్రీన్‌పార్కు ఏరియా, వినాయక ఆలయం, అబిద్‌నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అందుకోసం వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. జనసేన అభ్యర్థిగా సీతంరాజుకు టికెట్లు కేటాయించాలి.

50వ వార్డులో బీజేపీ కార్యాలయం ప్రారంభం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, మార్చి 12; గ్రేటర్ 50వవార్డులో మంగళవారం బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా హైవే రోడ్డులోని బిర్లాజంక్షన్‌లో టీడీపీ వ్యవస్థాకుడు నందమూరి.తారకరామారావు స్మారక విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ, టీడీపీ నాయకులతో ర్యాలీ నిర్వహింరు. మురళీనగర్ ప్రాథమిక పాఠశాల సమీపాన బీజేపీ వార్డు కార్యాలయం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం రాష్ట్రాభివృద్ధికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్, బీజేపీ నాయకులు, ప్రముఖ న్యాయవాది పృధ్వీరాజ్, బీజేపీ నాయకులు పరశురామ్, విజయచంద్రుడు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ కోసం సమష్టి పోరాటం

» అప్రా రాష్ట్ర కార్యదర్శి హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

మద్రిపాలెం, మార్చి 12: కనీస పెన్షన్ రూ.9వేలు వర్తించేలా అన్ని సంఘాలను కలుపుకుని సమష్టిగా పోరాటం చేస్తామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (అప్రా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ అన్నారు. మంగళవారం హాష్మీభవన్‌లో నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస పెన్షన్ సాధనకు పలు సంఘాలతో జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటు చేస్తామన్నారు. సభ్యులంతాపాల్గొనిఈ పోరాటంను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దీనబంధు, నాయకులు శ్రీనువాసమూర్తి, బాలాజీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్, యోగి వేమన విగ్రహాలు ఆవిష్కరణ

సీతమ్మధార, మార్చి 12: గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో జీవీఎంసీ పాఠశాల పక్కనున్న ఇందిరాగాంధీ పార్కులో వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆర్థిక సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, యోగి వేమన విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పార్టీ నేత డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి, కేకే రాజు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీవీ రమణి, వెంకటరమణ, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైసీపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేకే రాజు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మరెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, ఉషాశ్రీ పాల్గొన్నారు.

బీజేపీ వార్డు కార్యాలయం ప్రారంభం రేపు

అక్కయ్యపాలెం, మార్చి 12 : గ్రేటర్ 44వ వార్డు బీజేపీ కార్యాలయం రామచంద్రానగర్‌లో గురువారం ప్రారంభించనున్నట్లు అక్కయ్యపాలెం మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి తెలిపారు. ఈ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభిస్తారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

సరస్వతీ నిలయంలో అసాంఘిక పనులు



అసంపూర్తిగా ఉన్న పాఠశాల ప్రహరీ



ఆవరణలో బీరు సీసా, సిగరెట్ పీకలు

» నక్కవానిపాలెం-మద్దిలపాలెం జీవీఎంసీ పాఠశాలలో రాత్రి వేళల్లో మందుబాబులు చిందులు

» ఆవరణలోనే మల, మూత్ర విసర్జన

» ప్రహరీ అసంపూర్తి పనులతో సమస్య

సీతమ్మధార, మార్చి 12: నక్కవానిపాలెం, మద్దిలపాలెం గ్రామాలకు చెందిన జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. చీకటి పడితే మందుబాబులు, గంజాయి తాగినవారు చిందులు వేస్తున్నారు. పాఠశాల ప్రహరీని కొద్ది కాలం క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేసి కొత్తగా నిర్మించారు. గోడ పాఠశాల చివరి వరకు నిర్మించలేదు. ఈ పాఠశాల పక్కనే ఆలయం ఉంది. ఆలయానికి, పాఠశాలకు మధ్యలో గోడను నిర్మించకుండా జీవీఎంసీ కాంట్రాక్టర్ వదిలి వేయడంతో రాత్రి పూట మందుబాబులు, గోడ సందు లోంచి పాఠశాలలోకి ప్రవేశిస్తున్నారు. ఆవరణలో పూటుగా మందుతాగడంతో పాఠశాల ఆవరణలో మల, మూత్ర విసర్జనలు చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారే శుభ్రం చేయాల్సి వస్తోంది. స్కూల్ ఆవరణలో గల కొళాయిల ట్యాబ్‌లు చిల్లర దొంగలు దోచుకుపోతున్నారు. అసంపూర్తిగా ఉన్న గోడ వద్దేలోనికి ప్రతి ఒక్కరూ వస్తున్నట్టు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్కూల్ ఆవరణలో పేకాడుతున్నారు. పోలీసులు వచ్చినా స్కూల్ ఆవరణ లోనికి ఉండడంతో ఎవరికీ కనిపించటం లేదు. అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు, జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.పాఠశాల ప్రహరీని పూర్తిస్థాయిలో నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

గాజువాక వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

ఇవ్వాలని సూచించారు. తర్వాత కూడా సమన్వయకర్త హోదాలో చందు నిర్వహించే కార్యక్రమాలకు నాగిరెడ్డి గైర్హాజరవుతూ రావడంతో నియోజకవర్గంలో నేతల మధ్య విబేధాలు కొనసాగుతూ వచ్చాయి. నియోజకవర్గంలో నాగిరెడ్డి, ఉరుకూటి చందు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని నియోజకవర్గంలోని కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ హరివెంకటకుమారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరిగింది. దీనిపై గాజువాక నియోజకవర్గంలోని వైసీపీ కార్పొరేటర్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు బహిరంగంగా విమర్శలు చేసుకునే స్థాయికి వచ్చారు. అయినప్పటికీ మూడు రోజుల కిందట అమరావతిలో జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశంలో కూడా ప్రస్తుతం సమన్వయకర్తలుగా ఉన్నవారే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులంటూ పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. దీంతో గాజువాక అభ్యర్థిగా చందుయే పోటీ చేస్తారని అంతా భావించారు. హఠాత్తుగా గాజువాక సమన్వయకర్తగా ఉరుకూటి చందుని తొలగిస్తూ, అతని స్థానంలో మంత్రి అమర్‌నాథ్‌ను నియమిస్తున్నట్టు మంగళవారం పార్టీ అధిష్ఠానం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని ఇద్దరు నేతల వర్గ పోరు కారణంగానే అమర్‌నాథ్‌కు అవకాశం లభించిందని పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు.

పట్టాలెక్కిన మరో 2 వందే భారత్ రైళ్లు

... 5వ పేజీ తరువాయి

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం సందర్భంగా ప్లాట్‌ఫారంపై విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. భువనేశ్వర్ బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విద్యార్థులు, పలువురు ప్రముఖులను పలాస వరకు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మరొక రైలులో నగరానికి తీసుకువచ్చారు.

మహా విచిత్రం

... 5వ పేజీ తరువాయి

, పర్సంటేజీల కోసం స్టాండింగ్ కమిటీని అడ్డాగా మార్చుకున్నారని ఆరోపించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం పెట్టి చర్చించాల్సిన అంశాలను కూడా ముక్కలుగా విడగొట్టి స్టాండింగ్ కమిటీలో ఆమోదించేసుకుంటున్నారన్నారు. కౌన్సిల్ సమావేశం పెడితే ప్రతిపక్షాలు ఎండగడతాయని, అభివృద్ధి పనులు ముసుగులో చేస్తున్న అక్రమాలు బయటపడతాయనే భయంతోనే పాలకవర్గం పెద్దలు ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఉచిత సీట్లపై విద్యాశాఖ గోప్యత

... 5వ పేజీ తరువాయి

మించి లోడుతో తిరుగుతుండడంతో రోడ్లు దెబ్బతినడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి సీఈవో స్పందించి, పరిమితికి మించి బరువుతో వెళ్లే లారీలను పట్టుకుని కేసులు రాయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

గనుల శాఖపై చర్చ సందర్భంగా పరవాడ మండలం పెదముషిడివాడలో అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని స్వయంగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆవేదన వ్యక్తంచేశారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున నాలుగు వరకు గ్రావెల్ తవ్వకాలు అనధికారికంగా జరుగుతున్నాయని ఆరోపించగా...అనకాపల్లి గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు బదులిస్తూ పోలీసు, రెవెన్యూశాఖ సహాయంతో దాడులు చేస్తామని చెప్పారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ మండలంలో పలుచోట్ల అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. అడ్డురోడ్డు నుంచి పందూరు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తంచేయగా రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ కాంతిమతి స్పందిస్తూ...ఆ రోడ్డు నిర్మాణానికి టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకురావడం లేదన్నారు. ఇందుకు నిధుల కొరత ఉందని బదులిచ్చారు. దీనిపై ఉమాదేవి మాట్లాడుతూ ఏ పని చెప్పినా నిధులు లేవని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎంపీడీవోలకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

సమావేశాలకు సభ్యులు అతి తక్కువగా హాజరయ్యారు. వ్యక్తిగత పనులపై చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఈ సమావేశాలకు హాజరుకాకపోవడతో వైస్ చైర్మన్ సత్యవతి అధ్యక్షత వహించారు. అయితే నాలుగు, ఏడో స్టాండింగ్ కమిటీ సమావేశాలకు కోరం లేకపోవడంలో గంటపాటు వేచి ఉండాల్సి వచ్చింది. సభ్యులకు ఫోన్ చేసి వేగంగా రావాలని జడ్పీ సిబ్బంది విజ్ఞప్తి చేశారు. సభ్యులంతా ఎమ్మెల్యేలు/సమన్వకర్తల వెంట ఎన్నికలు ప్రచారంలో ఉన్నారంటున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు జీతాల బడ్జెట్ విడుదల

» సమ్మె కాల వేతనాలకు మొండిచేయి

కంచరపాలెం, మార్చి 12 : సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాల బడ్జెట్‌ను రాష్ట్ర కార్యాలయం మంగళవారం విడుదలచేసింది. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వెలువడిన రోజే ఈ జీతాల బడ్జెట్‌ను విడుదల కావడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గత సెప్టెంబరు నెలనుంచి సమగ్ర శిక్షా ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యంలో గత డిసెంబరు నెల 20వ తేదీ నుంచిజనవరి 12వ తేదీ వరకు నిరవధిక సమ్మెను కొనసాగించారు. దీంతో ప్రభుత్వం చర్చలు సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. కానీ, వేతనాల బకాయిలు చెల్లించడంలేదు. ఈ స్థితిలో ఉద్యమ బాటకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జీతాల బడ్జెట్‌ను మాత్రం మంగళవారం జిల్లా కార్యాలయాలకు పంపిస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. అ యితే, తమ సమ్మెకాలపు జీతాలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరసన తెలిపితేనే వేతనా లు?

సర్వ శిక్షా ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు 60 శాతం కేంద్ర ప్రభుత్వం ముందే విడుదల చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం సదరు నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తోంది. దీంతో కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఇకనైనా సకాలంలో వేతనాలుచెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం దృష్టికి మహిళా బ్యాంకు ఏర్పాటు

» రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

సిరిపురం, మార్చి 12: విశాఖ బీచ్‌రోడ్డు శుభ్రంగాగా ఉండేందుకు కృషి చేసిన చైతన్యస్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని, మహిళా బ్యాంకు ఏర్పాటుపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురజాడ కళాక్షేత్రంలో మంగళవారం చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా గృహలక్ష్మీ మ్యూచువల్లీ కో ఆపరేటివ్ ఎయిడెడ్ సొసైటీ సభ్యుల సమావేశాన్ని, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రెహమాన్, డాక్టర్ శిరీన్‌రెహమాన్ మహోన్నతమైన ఆశయంతో ఏర్పాటు చేసిన సంస్థ మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. 2006లో ప్రారంభించిన సొసైటీ రెండున్నర కోట్ల టర్నోవర్ సాధించడం అభినందనీయమన్నారు. ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ చైతన్యస్రవంతి దశాబ్దాలుగా చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.రెహమాన్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చైతన్యస్రవంతి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైతన్యస్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రెహమాన్ మాట్లాడుతూ మహిళల కోసం బ్యాంకు పెడితే బాగుంటుందన్నారు. అనంతరం మహిళా గ్రూపులకు డివిడెండ్లు పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఫణిప్రకాష్, చైతన్యస్రవంతి కార్యదర్శి అశోకకుమారి, మాజీ వీసీ లజపతిరాయ్, యూనీడీ పీడీ కేవీ పాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

17 మద్యం సీసాలు స్వాధీనం, ఇద్దరి అరెస్టు

పరవాడ, మార్చి 12: మండలంలోని తానాం గ్రామానికి చెందిన డి.అప్పలరాజు నుంచి పది మద్యం సీసాలు, నాయుడుపాలెం పంచాయతీ పరిధి కొండవానిపాలెం గ్రామానికి చెందిన పి.అప్పారావు నుంచి ఏడు మద్యం సీసాలను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నటు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

మహిళ హత్య కేసులో కోడలు అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 12: కొత్తూరు పంచాయతీ పరిధిలోని దేవీనగర్‌లో సోమవారం జరిగిన సింహాద్రమ్మ హత్య కేసులో నిందితురాలైన ఆమె కోడలు పూర్ణను మంగళవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. దేవీనగర్‌కు చెందిన ఈగల సింహాద్రమ్మ, ఆమె కోడలు పూర్ణ సోమవారం ఉదయం గొడవపడి, రుబ్బురోలు సన్నిగొడ్డతో తల, ముఖంపైన బలంగా మోదడంతో అత్త మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై మృతురాలి భర్త సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు పూర్ణను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

జనావాసాల మధ్య డంపింగ్ యార్డు

తీవ్ర దుర్గంధం, దుమ్ము, ధూళితో ఇబ్బందులకు గురవుతున్న 76వ వార్డు ప్రజలు

జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన


రామచంద్రానగర్‌లోని డంపింగ్ యార్డు

పెదగంట్యాడ, మార్చి 12: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 76వ వార్డు పరిధి రామచంద్రానగర్ పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రామచంద్రానగర్, రిక్షా కాలనీ, ఎస్సీకాలనీ, బర్మా కాలనీ,సుందరయ్య కాలనీలకు మధ్యలో.. జనావాసాలకు చేరువలో ఈ డంపింగ్ యార్డు ఉండడంతో స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. పెదగంట్యాడ ప్రాంతంలోని వివిధ కాలనీల్లో సేకరించిన చెత్తాచెదారం, వ్యర్థాలను జీవీఎంసీ సిబ్బంది ఇక్కడే డంపింగ్ చేస్తున్నారు. నిత్యం వందల టన్నుల చెత్తాచెదారాన్ని ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్ల ద్వారా వ్యర్థాలను, చెత్తను ఎప్పటికప్పుడు ఒక పక్కకు చేర్చుతారు. ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను సేకరించి రీ సైక్లింగ్ చేసేందుకు తరలిస్తుంటారు. రోజంతా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఇలాంటి సమయంలో డంపింగ్ యార్డు నుంచి విపరీతమైన దుర్వాసన వెలువడుతుందని, దీనివల్ల తాము తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. వ్యర్థాలను డంపింగ్ చేసేటప్పుడు, యంత్రాలతో చెత్తాచెదారాన్ని పక్కకు తీసేటప్పుడు ఎగిరిన దుమ్ము, ధూళి ఎగిరి ఎగిరి పరిసర కాలనీల్లోని నివాసాలపై పడుతుందని స్థానికులు చెబుతున్నారు. తీవ్ర దుర్గంధం, దుమ్ము ధూళి తమ ఆరోగ్యాలపై ప్రభావం చూపుతుందంటూ కాలనీలవాసులు ఇప్పటికే అనేకసార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. డంపింగ్ యార్డును ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని పలుమార్లు ఆందోళనలు కూడా చేశారు. ఆయా కాలనీల అసోసియేషన్లు, రాజకీయ పార్టీల నాయకులు సైతం డంపింగ్ యార్డును తరలించాలని అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం శూన్యంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్ యార్డు తరలింపునకు తగిన చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

నానాపాట్లు పడుతున్నాం



జనావాసాల మధ్యలో చంద్రానగర్ పక్కన డంపింగ్ యార్డు ఉండడం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. భరించరాని దుర్వాసన, విజృంభిస్తున్న దోమలు, దుమ్ము, ధూళి కారణంగా స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లాం. అధికారులు వచ్చి డంపింగ్‌యార్డును పరిశీలించి వెళ్లారే తప్ప సమస్య పరిష్కారా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చేపాలి.

-బోరా భాస్కరరావు, అధ్యక్షుడు రామచంద్రానగర్ అసోసియేషన్

దూర ప్రాంతానికి తరలించాలి



76వ వార్డులోని పలు కాలనీ మధ్యనున్న డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని అనేకసార్లు జీవీఎంసీ అధికారులకు వివరించాం. జీవీఎంసీ పాలక మండలి సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని లేవనెత్తి సమస్యను పరిష్కరించాలని కోరాం. రెండేళ్లుగా సాగుతున్న ఈ పోరాటానికి పరిష్కారాన్ని చూపాలని మేయర్‌ను కూడా కోరాం.

-గంధం శ్రీనివాసరావు, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్


లబ్ధిదారులకు వస్త్రాలు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అప్పగింత

ప్రభుత్వ పాలనలో జరిగిన మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించాలి

వైసీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, మార్చి 12: వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ ప్రభుత్వం ప్రజాభిమానం పొందుతుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌లు పేర్కొన్నారు. స్థానిక అచ్చినాయుడుతోటలోని 4,900 టిడ్కో ఇళ్లను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ 175/175 సీట్లు సాధించేందుకు కృషి చేస్తున్నారని, దానికి నాయకులు, కార్యకర్తలు కూడా తోడవ్వాలని కోరారు. వైసీపీ పాలనలో జరిగిన మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి మరింత మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, కొణతాల సుధ, పీవీ సురేశ్, గుండపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదండి బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తనక్కవానిపాలెంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

పారిశ్రామిక ప్రాంతం కొత్తనక్కవానిపాలెంలోని వైసీపీ కార్యాలయం వద్ద మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాక దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పేదోడి ఇంట్లో వెలుగులు నిండాలంటే అది వైసీపీ వల్లే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై ప్రజలకు అవగాహన


అపార్టుమెంటువాసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సూర్యనారాయణ

గోపాలపట్నం, మార్చి 12: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా చోరీల నియంత్రణ సాధ్యమని ఎస్‌ఐ సూర్యనారాయణ అన్నారు. 89వ వార్డు డీఏఆర్ నగర్ కాలనీలో అపార్ట్‌మెంటు వాసులకు చోరీల నియంత్రణపై మంగళవారం సాయంత్రం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఇళ్లకు తాళం వేసి ఊరెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం అందించాలని, విలువైన ఆభరణాలు, నగదును ఇంట్లో ఉంచరాదని సూచించారు. నిర్మానుష్య ప్రాంతాలకు వాకింగ్‌కు వెళ్లే సమయాల్లో మహిళలు ఆభరణాలు ధరించరాదన్నారు. అపార్ట్‌మెంట్ల ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలంటూ పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ గోవిందమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమితో వైసీపీలో వణుకు

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, మార్చి 12: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీలో వణుకు ప్రారంభమైందని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో వైసీపీ నాయకులు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. శవ రాజకీయాలు చేయడం వైసీపీ వాళ్లకు అలవాటుగా మారిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతో పాటు ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజయకుమార్, మొల్లి పెంటిరాజు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వారోత్సవాలపై ర్యాలీ

వేపగుంట, మార్చి 12: ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు పురస్కరించుకుని నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారం. ఇందులో భాగంగా ఉద్యోగులు ఆస్పత్రి నుంచి నాయుడుతోట మీదుగా వేపగుంట కూడలి వరకు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. గ్లకోమా వ్యాధి నిశ్శబ్దంగా వ్యాప్తి చెందుతుందని, దీని కారణంగా కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని, దీనిని అరికట్టేందుకు ఆరు నెలలుకొకసారైనా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రవీంద్ర సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు లక్ష్మీ, మంజువల్లి, కవితాదేవి, సువర్ణ శశి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై ఎమ్మెల్యేను నిలదీసిన జనం

కొమ్మాది, మార్చి 12: సంక్షేమ పథకాలు సరే పెరుగుతున్న కరెంటు బిల్లులు, నిత్యావసర సరకుల ధరలతో ఎలా బతకాలి అంటూ మహిళలు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును నిలదీశారు. మారికవలస యాతపాలెం రాజీవ్‌గృహకల్పకాలనీల్లో మంగళవారం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలపై ఏకరువు పెడుతుండగా ఓ మహిళ షాక్ ఇచ్చింది. సంక్షేమ పథకాలతో ఉపయోగమేంటని నిలదీసింది. కరెంటు బిల్లులు, నిత్యావసర సరకుల ధరలతో బతకలేని పరిస్థితులున్నాయని వాపోయింది. ఆమెతో పాటు మరింత మంది మహిళలు సమస్యలపై ప్రశ్నించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, దోమల బెడద పెరిగిందని, నడవడానికి కూడా వీలులేని స్థితిలో ఐనరోడ్లు ఉన్నాయని, వీటిని పట్టించుకోకుండా పథకాలు ఇస్తే సరిపోతుందా అని నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు


మహిళలతో మాట్లాడుతున్న గణబాబు

మల్కాపురం, మార్చి 12: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అధోగతిపాలైందని 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు విమర్శించారు. 61వ వార్డులో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలను ఏ విధంగో మోసం చేస్తుందో వివరించారు. రాష్ట్రానికి మేలు చేకూరాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తమ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల వల్ల మహిళలతో పాటు అన్ని వర్గాలకు ఎంతో మంచి జరుగుతుందన్నారు. ప్రియదర్శిని కాలనీ, మసీదు వీధి, ప్రకాశ్‌నగర్, ఏడుగుళ్ల జంక్షన్, బాపూజీ కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీలలో ఆయన ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మజ్జి సోమేశ్, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, జి.జయశంకర్, పోలిరెడ్డి, డేవిడ్, దేవన్‌రాజు, శంకరమ్మ, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

» సీహెచ్‌సీ, బాలికల, బాలుర వసతిగృహాల సందర్శన » వసతులపై ఆరా తీసిన మల్లికార్జున

పెందుర్తి, మార్చి 12: పెందుర్తిలో జిల్లా కలక్టర్ డాక్టర్.ఎ.మల్లికార్జున మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు.

ఈ సందర్భంగా పెందుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, బాలికల వసతిగృహాన్ని, నరవలోని బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా ఆయన సందర్శిం చారు. సీహెచ్‌సీని సందర్శించిన ఆయన ఇక్కడి 30 పడకల ఆస్పత్రిలోని మౌలిక మౌలిక వసతులపై ఆరా తీశారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. పలువురు రోగులతో ఆయన మాట్లాడి వైద్య సదుపాయాలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి, రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు.ప్రసూతి విభాగంలో అత్యవసర సేవలను నిరంతరాయంగా అందించాలని సూచించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై మల్లికార్జున సంతృప్తి వ్యక్తం చేశారు. సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి అవంతి, డాకర్ దొర, సిబ్బంది పాల్గొన్నారు.


పీహెచ్‌సీలోని వసతుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ మల్లికార్జున

కార్పొరేట్ స్థాయిలో వసతిగృహాలు

అనంతరం కలెక్టర్ పెందుర్తి, నరవలో గల బాలికల, బాలుర వసతిగృహాలను సందర్శించారు. ఆయా వసతిగృహాల్లో రూ.56 లక్షలతో ఆధునీకరించిన భవనాలను ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాలను ఆధునీకరించి కార్పొరేట్ స్థాయిలో తీర్చుదిద్దుతున్నామన్నారు. బాలికల వసతిగృహంలో స్నానపు గదులు, టాయిలెట్లు, వంట గదిని పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, తదితర సదుపాయాల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. భయం వీడి టెన్త్ పరీక్షలను బాగా రాయాలని పలువురు విద్యార్థినులకు సూచిం చారు. ఇక్కడ పువ్వులు, కూరగాయలు, ఆకుకూరలను విద్యార్థినులే సాగు చేసి పెంచుతున్నట్టు తెలుసుకున్న కలెక్టర్ వారిని అభినందించారు. అనంతరం హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయన వెంట డీఈవో చంద్రకళ,డీడీ రామారావు, ఎస్ఎస్ఏపీవో శ్రీనివాసరావు, హాస్టల్ వార్డెన్ సత్యవతి ఉన్నారు.


భవితా కేంద్రంలో ఫిజియోథెరపీ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

భవితా కేంద్రంలో ఫిజియోథెరపీ భవనం ప్రారంభం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని భవితా కేంద్రంలో అభయం ఫౌండేషన్, స్పందన చేయూత ఫౌండేషన్ సౌజన్యంతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన భవనాన్ని కలెక్టర్ మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సేవ చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్షా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపల్ మాణిక్యంనాయుడు, 'అభయం', స్పందన చేయూత ఫౌండేషన్ సభ్యులు బుచ్చిరాజు, కె.రవి, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌కు అనుమతించేది లేదు

ఉక్కు యాజమాన్యం వేసిన కమిటీకి తెలిపిన కార్మిక నాయకులు

సమస్యలను పరిష్కరించాకే అమలు చేయాలని స్పష్టకరణ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 12: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించిన తరువాతే బయోమెట్రిక్ అమలు చేయాలని, అంతవరకు పాత పద్ధతినే కొనసాగించాలని ఉక్కు యాజమాన్యానికి కార్మిక నాయకులు తేల్చి చెప్పారు. కార్మిక నాయకులు, ఉక్కు అధికారులకు మధ్య ఎంతో వాడీవేడిగా సమావేశం జరిగిందని, యాజమాన్యం తీరు మార్చుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించామని కార్మిక నాయకులు తెలిపారు. బయోమెట్రిక్ అమలుపై ఉక్కు యాజమాన్యం వేసిన కమిటీ మంగళవారం ప్లాంట్‌లో సమావేశమైంది. ప్లాంట్‌లో తాగునీరు, బాత్‌రూమ్‌లు, క్యాంటీన్‌లో మౌలిక వసతులతో పాటు వేతన సవరణ చేసిన తర్వాతే బయోమెట్రిక్‌ను అమలు చేయాలని కోరామని పేర్కొన్నారు. ఇదిలావుండగా ఇప్పటివరకు కొంత మంది మాత్రమే తమ ఇడెంటిటీని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు చెప్పగా.. అందుకు కార్మిక నాయకులు వ్యతిరేకించారు. అయితే ఐడెంటిటీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు బయోమెట్రిక్‌తో పాటు డార్స్ (పేపర్లపై సంతకాలు చేయడం)పై సంతకాలు కూడా చేయాలని అధికారులు సూచించారు. మరోసారి శనివారం కమిటీ సమావేశం జరగనుందని కార్మిక నాయకులు తెలిపారు.

సినిమా గైడ్

● **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)

● **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)

● **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)

● **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 14, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 24, క్యారెట్25, దొండకాయలు 22, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 46, బరబాటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

వైభవంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వేపగుంట, మార్చి 12: నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి శోభాయాత్రను ప్రారంభిచారు. సింహాచల లక్ష్మీనృసింహస్వామి మంత్ర ఉపాసకులు, విశ్రాంతాచార్యులు ముప్పిరాల నారాయణమూర్తి పర్యవేక్షణలో అర్చకులు శ్రీనివాసస్వామి సారథ్యంలో స్వామివారికి పూజలు చేశారు. మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ సంకల్పం, పుట్ట బంగారం సేకరణ చేపట్టారు. అనంతరం ఉభయ దాతలకు కంకణధారణ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణం, తోరణ యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు, తదితర పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం, మార్చి 12: స్థానిక బంటా కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లపువానిపాలెంలో ఇళ్ల పట్టాల పంపిణీ

గోపాలపట్నం, మార్చి 12: భీమిలి నియోజకవర్గం ఎల్లపువానిపాలెంలోని 463, 465, 466 సచివాలయాల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంగళవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి గోపి, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. సచివాలయ సిబ్బంది, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

96వ వార్డులో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం


వైఎస్ విగ్రహానికి పూలమాల దాడి ఉమామహేశ్వరరావు

పెందుర్తి, మార్చి 12: వైసీపీ 96వ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం పెందుర్తిలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కూడలిలోని దివంగత వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సంఘీభావం తెలుపుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

'రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 12: ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం ఈ నెల 15న ప్లాంట్ త్రిష్నా మైదానంలో జరగనున్న బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమానికి మద్దతు తెలిపి ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనే డిమాండ్‌తో ఈ సభ జరుగుతుందన్నారు. భారీ ఎత్తున ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, నిర్వాసితులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు సభలో పాల్గొనవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో నాయకులు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరాం, జె.రిపోతుల ముత్యాలు, జి.గణపతిరెడ్డి, వైటీ దాసు, కారు రమణ, తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ అంశాన్ని పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలి'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 12: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ప్రతి రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టోలో చేర్చాలని ఉక్కు ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు డిమాండ్ చేశారు. అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగితే అన్ని వర్గాల వారికి ఉపాధి లభిస్తుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు జి.అప్పలరాజు, పెంటారావు, సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

కూర్మన్నపాలెం, మార్చి 12: విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేశ్ అన్నారు. వీఎస్ఈజెడ్ సినర్జీస్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ భద్రతా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ కార్మికులంతా భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలన్నారు. ఉద్యోగులతో బాధ్యతతో ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రమాదాల బారిన పడకుండా భద్రతా పరికరాలను వినియోగించాలన్నారు. సినర్జీస్ ప్రాజెక్ట్స్ జీఎం రమేశ్‌బాబు మాట్లాడుతూ చిన్న తప్పిదాలే పెద్ద ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. పలు పోటీల విజేతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

72వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గాజువాక, మార్చి 12: జీవీఎంసీ 72వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాకను అన్నివిధాల అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏజే స్టాలిన్, రాజాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.88 లక్షలు

పెందుర్తి, మార్చి 12: జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషిడివాడ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.88 లక్షల నిధులు మంజూరైనట్టు కార్పొరేటర్ సేనాపతి వసంత మంగళవారం తెలిపారు. శ్మశాన వాటిక అభివృద్ధికి తొలుత తక్కువ నిధులు మంజూరు చేయడంతో జీవీఎంసీ కమిషనర్‌కు సమస్యను వివరించి అధిక నిధులు సాధించగలిగామన్నారు. ఈ నిధులతో శ్మశానవాటికను ఆధునీకరిస్తామని పేర్కొన్నారు.

సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

అగనంపూడి, మార్చి 12: స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడుకు అఖిలపక్షం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను జెడ్సీకి వివరించారు. చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య ఉందని, వీధి దీపాలు వెలగక చీకటి పడితే అంధకారం తాండవిస్తోందని పోర్టు నుంచి వచ్చే బొగ్గు లారీల వల్ల కాలుష్యం పెరిగిపోయిందన్నారు. కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జెడ్సీని కలిసిన వారిలో అఖిలపక్షం నాయకులు నెల్లి శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ, బి.సత్యనారాయణ, డి.పైడికొండ, వి.వరహాలు, కె.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

ఫార్మా నిర్వాసితుల పట్టాలు మంజూరు చేయాలి

అగనంపూడి, మార్చి 12: ఫార్మా నిర్వాసిత మేజర్లకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నిర్వాసితులు కలిసి విజ్ఞప్తి చేశారు. 2010 నాటికి మేజర్లు అయిన నిర్వాసితులకు పట్టాలు మంజూరు చేయాలంటూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కాపీని కలెక్టర్‌కు అందజేశారు. త్వరితగతిన నిర్వాసితులకు పట్టాలు కేటాయించేలా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నిర్వాసిత నాయకులు ఇల్లపు ప్రసాద్, వాసు, హరి రామకృష్ణ, శ్రీనివాసరావు, కట్టా రాజశేఖర్, ఎస్.శ్రీను, తదితరులు ఉన్నారు.

కార్మిక సమస్యలపై నివేదిక అందజేత


పల్లా శ్రీనివాసరావుకు నివేదిక లెనిన్‌బాబు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 12: టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు నిర్వహించిన కార్మిక చైతన్య బస్సు యాత్రలో వివిధ కార్మిక సంఘాల నాయకులను కలిసి గుర్తించిన ప్రధాన సమస్యలకు సంబంధించిన నివేదికను టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు అందజేశారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కలిసి వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వర్గాల కార్మికులు ఇబ్బందులకు గురయ్యారని, వైసీపీ కార్మికులను విస్మరించిందన్నారు. దీంతో ఎంతో మంది జీవితాలు దుర్భరంగా మారాయని నివేదికలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలునాయుడు, పెంటిరాజు, శ్రీనివాస్, దశేంద్ర, అప్పారావు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

గోపాలపట్నం, మార్చి 12: రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభం కావడంతో ముస్లింలు ఉపావాస దీక్షలు ప్రారంభించారు. గోపాలపట్నంలోని తాహా మసీదు, కొత్తపాలెంలోని నూరానియా మసీదు, నందమూరినగర్‌లోని ఉమర్ సుల్తాన్ మసీదుల్లో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రంజాన్ నెలను పురస్కరించుకని మసీదుల్లో ప్రతిరోజు ఐదు వేళలా ఆచరించే నమాజులతో పాటు రంజాన్ నెలలో రాత్రి వేళలో ఆచరించే తరావీ నమాజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే సమయంలో మసీదుల్లో నిర్వహించే ఇఫ్తార్‌కు పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొనడంతో పండుగ వాతావరణ నెలకొంటుంది.

అర్థమయ్యేలా బోధనను అందించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి

డాబాగార్డెన్స్, మార్చి 12: అధ్యాపకులు వినూత్న రీతిలో అర్థమయ్యేలా బోధించేందుకు నిరంతరం కృషి చేయాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై.లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సింగిల్ మేజర్ సబ్జెక్టులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జూవాలజీ, బయోలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి జిల్లాలోని అధ్యాపకులకు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు నూతన విద్యావిధానం, పరిశోధనలు సంబంధించిన నూతన పోకడలను తెలుసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డా.శిరీష, ఎస్.లావణ్య, టి.శ్యాముల్ డేవిడ్‌రాజ్, కె.రేఖ, డి.ప్రజ్ఞ , అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ



మెటీరియల్ అందిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

అక్కయ్యపాలెం, మార్చి 12 : తమ్మినేని ఇందువతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమైనవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు రాస్తున్న రెండువేల మంది విద్యార్థులకు ట్రస్ట్ సమకూర్చిన పరీక్ష అట్టలు, పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ కార్యక్రమాన్ని ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ శాసనసభ తమ్మినేని సీతారాం మాతృమూర్తి ఇందువతమ్మ పేరిటఅందిస్తున్న సేవలను కొనియాడారు. అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వప్పల రామ్మోహన్ మాట్లాడుతూవిద్యార్థులు ఒత్తిడి లేని విధంగా పరీక్షలు రాయాలని సూచించారు.హెచ్‌ఎం బి.లక్ష్మీనరస, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రమణకుమారి, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకుంతల, నగర కన్వీనర్ కె.ఎల్లయ్య, లవకుశ, ఎం.హరీష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈద్ పార్కు విస్తరణ స్థలం కోసం వినతి

జగదాంబ కూడలి, మార్చి 12: గ్రేటర్ 39 వార్డు పరిధిలోని ఈద్ పార్కు విస్తరణకు సమీపాన ఉన్న పోర్టు ట్రస్ట్ ఆధీనంలో ఉన్న 15 అడుగుల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శరణ్‌మసీదు కమిటీ ప్రతినిధులు పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ అంగముత్తుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పోర్టు ఛైర్మన్‌కు మసీద్ కమిటీ, కోటవీధి ప్రాంత ముస్లింలు ఈద్ పార్కు విస్తరించడంతో రంజాన్ మాసం సందర్భంగా సామూహిక నమాజ్‌కు అనుకూలంగా ఉంటుందని వివరించారు. జీవీఎంసీ ఈద్ పార్కు విస్తరణకు అనుమతించిందన్నారు. ఈస్థితిలో పోర్టు ఆధీనంలో ఉన్న స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పం దించినట్లు మసీద్ కమిటీ ప్రదినిధులు గఫూర్ వెల్లడించారు.

నేటినుంచి
డయల్ యువర్ కలెక్టర్ ఓటరు హెల్ప్‌లైన్

మహారాణిపేట, మార్చి 12: ఈనెల 13వ తేదీ నుంచి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు డయల్ యువర్ కలెక్టర్ ద్వారా ఓటర్ హెల్ప్‌లైన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు ప్రజల నుంచి ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఓటు నమోదు, ఓటరు గుర్తింపు కార్డు పోలింగ్ స్టేషన్ వివరాలకు, చిరునామాలు మార్పు తదితర సందేహాలపై సమాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫోన్: 0891-2590100 నంబరుకు ప్రజలు నేరుగా కలెక్టర్‌తో మాట్లాడవచ్చు.

మండుటెండలో రేషన్ కోసం పడిగాపులు



చిట్టిబాబుకాలనీ దగ్గర ఎండల్లో నిలుచున్న లబ్ధిదారులు

మురళీనగర్, మార్చి 12; ఇళ్ల వద్దకే రేషన్ సరుకుల పంపిణీ అంటూ వైసీపీ ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో జనాలకు అగచాట్లు తప్పడంలేదు. మంగళవారం ఆర్‌అండ్‌బీ జంక్షన్ చిట్టిబాబుకాలనీ దగ్గర ఎండలో మహిళలు నిల్చుని రేషన్ బియ్యం విడిపించారు. గత టీడీపీ హయాంలో రేషన్ డిపోల్లో ప్రతినెలా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ సరుకులు పంపిణీ జరిగేది. కానీ ప్రస్తుతం ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తున్నాజనాలకు ఇబ్బందులు తప్పడంలేదు. మండుటెండలో నిల్చోవాల్సి వస్తోంది. వీధుల్లో వాహనాలను నిలిపి సరుకులను అందిస్తున్నారు. అదీ ఏ శివారునో సైరన్ మోగుతుంది. అది వినిపించకుంటే సరుకులకు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి వలంటీర్లతో కార్డుదారులకు సమాచారమిచ్చినా వాహనం రాకలో ఆలస్యమవుతోంది. సరుకుల కోసం వీధుల్లో లబ్ధిదారులు ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు తమ వీధిలోకి బండి ఎపుడు పెడతారోనని ఎదురు చూడటమే పనిగా మారింది. పనులకు వెళ్లిన వారి పరిస్థితి దారుణం. వాహనం కోసం తప్పనిసరిగా వేచిచూడాల్సి వస్తోంది. గతంలో దుకాణాల్లో పంపిణీ ఎప్పుడు కావల్సిస్తేఅప్పుడు రేషన్ తెచ్చుకునే వెసులుబాటు ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎండీయూలు, వలంటీర్లే సమయం నిర్ణయిస్తున్నారు.ఏ తేదీలో ఎక్కడ తీసుకోవాలో వారే చెబుతారు. ఈ తిరకాసు పంపిణీ బదులు రేషను దుకాణాల్లోనే సక్రమంగా పంపిణీ జరిగేలా చూస్తే మంచిదని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

'దక్షిణ' టికెట్ గండి బాబ్జీకే కేటాయించాలి'

మహారాణిపేట, మార్చి 12: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి గండిబాబ్జీకే పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించాలని తెలుగుయువత అధ్యక్షుడు తాతాజీ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లో నియోజకవర్గ పార్టీ నాయకులు సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం ప్రకటించిన తొలి జాబితాలోగండి బాబ్జీ పేరు లేకపోవటం బాధాకరమన్నారు. రెండవ లిస్టులో అయినా ఆయనకు టికెట్ ప్రకటించాలని కోరారు. కొన్ని నెలలుగా బాబ్జీ వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో ముందున్నారన్నారు. అయితే పొత్తులో భాగంగా జనసేన, బీజేపీలలో ఎవరికి దక్షిణ నియోజకవర్గ టికెట్ కేటాయిస్తే పార్టీ అధిష్టానం సూచనలను తప్పనిసరిగా శిరసావహిం చి పనిచేస్తామన్నారు. కూటమి అభ్యర్థి మెజారిటీతో గెలిపించి చంద్ర బాబుకు బహుమతిగా అందజేస్తామన్నారు.ఈ సమావేశంలో నాయ కులు పి.ఎం.రమణ, కేదారి లక్ష్మి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50వ వార్డులో బీజేపీ కార్యాలయం ప్రారంభం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, మార్చి 12; గ్రేటర్ 50వవార్డులో మంగళవారం బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా హైవే రోడ్డులోని బిర్లాజంక్షన్‌లో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి.తారకరామారావు స్మారక విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ, టీడీపీ నాయకులతో ర్యాలీ నిర్వహిం రు. మురళీనగర్ ప్రాథమిక పాఠశాల సమీపాన బీజేపీ వార్డు కార్యాలయం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం రాష్ట్రాభివృద్ధికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్, బీజేపీ నాయకులు, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్, బీజేపీ నాయకులు పరశురామ్, విజయచంద్రుడు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీఎల్ సహకారంతో ఉపకరణాల పంపిణీ



దివ్యాంగునికి వాహనాన్ని అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, మార్చి 12: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) సహకారంతో దివ్యాంగులకు మోటారైజ్డ్ వాహనాలను, వీల్‌చైర్లను పంపిణీ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ మల్లికార్జున చేతుల మీదుగా సు మారు రూ. 42 లక్షల విలువైన 50 మోటారైజ్డ్ వాహనాలు , 200 వీల్ చైర్‌లను అం దజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఐదు నెలల్లో ఐఓసీఎల్ సహకారంతో, సుమారు రూ.కోటి సీఎస్‌ఆర్ నిధులతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేసట్టినట్లు తెలిపారు. సంస్థ అందిస్తున్న సేవలకు అభినందనలు తెలిపారు. ఈసమావేశంలో దివ్యాంగుల సంస్థ సహాయ సంచాలకులు మాధవి, ఐఓసీఎల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డి. సుధాకర్, మేనేజర్లు సత్యనారాయణ, పి శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ కోసం సమష్టి పోరాటం

» అప్రా రాష్ట్ర కార్యదర్శి హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

మద్దిపాలెం, మార్చి 12: కనీస పెన్షన్ రూ.9వేలు వర్తించేలా అన్ని సంఘాలను కలుపుకుని సమష్టిగా పోరాటం చేస్తామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (అప్రా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ అన్నారు. మంగళవారం హాష్మీభవన్‌లో నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస పెన్షన్ సాధనకు పలు సంఘాలతో జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటు చేస్తామన్నారు. సభ్యులంతాపాల్గొనిఈ పోరాటంను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దీనబంధు, నాయకులు శ్రీనువాసమూర్తి, బాలాజీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వేధింపులు నిరోధించాలి



గీతాంజలి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన

రామ్‌నగర్, మార్చి 12: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారణమైన వైసీపీ సోషల్ మీడియాకు చెందిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, రాష్ట్ర స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షోషల్ మీడియా వేధింపులతో మృతిచెందిన గీతాంజలి కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. 20 లక్షలు కాకుండా, కోటి రూపాయలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సోషల్ మీడియాలో అశ్లీల పోస్టింగ్‌లను నిరోధించాలని కోరారు. సోషల్ మీడియా మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అసత్య ప్రచారాలు మానుకోవాలని కోరారు.బీసీ సంక్షేమ సంఘం నాయకులున్నారు.

వైఎస్ఆర్, యోగి వేమన విగ్రహాలు ఆవిష్కరణ

సీతమ్మధార, మార్చి 12: గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో జీవీఎంసీ పాఠశాల పక్కనున్న ఇందిరాగాంధీ పార్కులో వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆర్థిక సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, యోగి వేమన విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పార్టీ నేత డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి, కేకే రాజు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీవీ రమణి, వెంకటరమణ, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైసీపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేకే రాజు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మరెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, ఉషాశ్రీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 12: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, ఎన్‌జీజీఓస్ కాలనీ, గ్రీన్‌పార్కు ఏరియా, వినాయక ఆలయం, అబిద్‌నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అందుకోసం వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. జనసేన అభ్యర్థిగా సీతంరాజుకు టికెట్లు కేటాయించాలి.

బీజేపీ వార్డు కార్యాలయం ప్రారంభం రేపు

అక్కయ్యపాలెం, మార్చి 12 : గ్రేటర్ 44వ వార్డు బీజేపీ కార్యాలయం రామచంద్రానగర్‌లో గురువారం ప్రారంభించనున్నట్లు అక్కయ్యపాలెం మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి తెలిపారు. ఈ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభిస్తారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

సరస్వతీ నిలయంలో అసాంఘిక పనులు



అసంపూర్తిగా ఉన్న పాఠశాల ప్రహరీ



ఆవరణలో బీరు సీసా, సిగరెట్ పీకలు

» నక్కవానిపాలెం-మద్దిలపాలెం జీవీఎంసీ పాఠశాలలో రాత్రి వేళల్లో మందుబాబులు చిందులు
» ఆవరణలోనే మల, మూత్ర విసర్జన
» ప్రహరీ అసంపూర్తి పనులతో సమస్య

సీతమ్మధార, మార్చి 12: నక్కవానిపాలెం, మద్దిలపాలెం గ్రామాలకు చెందిన జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. చీకటి పడితే మందుబాబులు, గంజాయి తాగినవారు చిందులు వేస్తున్నారు. పాఠశాల ప్రహరీని కొద్ది కాలం క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేసి కొత్తగా నిర్మించారు. గోడ పాఠశాల చివరి వరకు నిర్మించలేదు. ఈ పాఠశాల పక్కనే ఆలయం ఉంది. ఆలయానికి, పాఠశాలకు మధ్యలో గోడను నిర్మించకుండా జీవీఎంసీ కాంట్రాక్టర్ వదిలి వేయడంతో రాత్రి పూట మందుబాబులు, గోడ సందు లోంచి పాఠశాలలోకి ప్రవేశిస్తున్నారు. ఆవరణలో పూటుగా మందుతాగడంతో పాఠశాల ఆవరణలో మల, ముత్ర విసర్జనలు చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారే శుభ్రం చేయాల్సి వస్తోంది. స్కూల్ ఆవరణలో గల కొళాయిల ట్యాప్‌లు చిల్లర దొంగలు దోచుకుపోతున్నారు. అసంపూర్తిగా ఉన్న గోడ వల్లేలోనికి ప్రతి ఒక్కరూ వస్తున్నట్టు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్కూల్ ఆవరణలో పేకాడుతున్నారు. పోలీసులు వచ్చినా స్కూల్ ఆవరణ లోనికి ఉండడంతో ఎవరికీ కనిపించటం లేదు. అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు, జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.పాఠశాల ప్రహరీని పూర్తిస్థాయిలో నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

గాజువాక వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

ఇవ్వాలని సూచించారు. తర్వాత కూడా సమన్వయకర్త హోదాలో చందూ నిర్వహించే కార్యక్రమాలకు నాగిరెడ్డి గైర్హాజరవుతూ రావడంతో నియోజకవర్గంలో నేతల మధ్య విభేదాలు కొనసాగుతూ వచ్చాయి. నియోజకవర్గంలో నాగిరెడ్డి, ఉరుకూటి చందు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని నియోజకవర్గంలోని కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ హరివెంకటకుమారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరిగింది. దీనిపై గాజువాక నియోజకవర్గంలోని వైసీపీ కార్పొరేటర్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు బహిరంగంగా విమర్శలు చేసుకునే స్థాయికి వచ్చారు. అయినప్పటికీ మూడు రోజుల కిందట అమరావతిలో జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశంలో కూడా ప్రస్తుతం సమన్వయకర్తలుగా ఉన్నవారే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులంటూ పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. దీంతో గాజువాక అభ్యర్థిగా చందూయే పోటీ చేస్తారని అంతా భావించారు. హఠాత్తుగా గాజువాక సమన్వయకర్తగా ఉరుకూటి చందూని తొలగిస్తూ, అతని స్థానంలో మంత్రి అమర్‌నాథ్‌ను నియమిస్తున్నట్టు మంగళవారం పార్టీ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని ఇద్దరు నేతల వర్గపోరు కారణంగానే అమర్‌నాథ్‌కు అవకాశం లభించిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

పట్టాలెక్కిన మరో 2 వందే భారత్ రైళ్లు

... 5వ పేజీ తరువాయి

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం సందర్భంగా ప్లాట్‌ఫారంపై విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. భువనేశ్వర్ బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విద్యార్థులు, పలువురు ప్రముఖులను పలాస వరకు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మరొక రైలులో నగరానికి తీసుకువచ్చారు.

మహా విచిత్రం

... 5వ పేజీ తరువాయి

, పర్సంటేజీల కోసం స్టాండింగ్ కమిటీని అడ్డాగా మార్చుకున్నారని ఆరోపించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం పెట్టి చర్చించాల్సిన అంశాలను కూడా ముక్కలుగా విడగొట్టి స్టాండింగ్ కమిటీలో ఆమోదించేసుకుంటున్నారన్నారు. కౌన్సిల్ సమావేశం పెడితే ప్రతిపక్షాలు ఎండగడతాయని, అభివృద్ధి పనులు ముసుగులో చేస్తున్న అక్రమాలు బయటపడతాయనే భయంతోనే పాలకవర్గం పెద్దలు ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఉచిత సీట్లపై విద్యాశాఖ గోప్యత

... 5వ పేజీ తరువాయి

మించి లోడుతో తిరుగుతుండడంతో రోడ్లు దెబ్బతినడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి సీఈవో స్పందించి, పరిమితికి మించి బరువుతో వెళ్లే లారీలను పట్టుకుని కేసులు రాయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

గనుల శాఖపై చర్చ సందర్భంగా పరవాడ మండలం పెదముషిడివాడలో అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని స్వయంగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆవేదన వ్యక్తంచేశారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున నాలుగు వరకు గ్రావెల్ తవ్వకాలు అనధికారికంగా జరుగుతున్నాయని ఆరోపించగా..అనకాపల్లి గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు బదులిస్తూ పోలీసు, రెవెన్యూశాఖ సహాయంతో దాడులు చేస్తామని చెప్పారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ మండలంలో పలుచోట్ల అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. అడ్డురోడ్డు నుంచి పందూరు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తంచేయగా రోడ్లు, భవనాల శాఖ ఎస్‌ఈ కాంతిమతి స్పందిస్తూ..ఆ రోడ్డు నిర్మాణానికి టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకురావడం లేదన్నారు. ఇందుకు నిధుల కొరత ఉందని బదులిచ్చారు. దీనిపై ఉమాదేవి మాట్లాడుతూ ఏ పని చెప్పినా నిధులు లేవని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎంపీడీవోలకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

సమావేశాలకు సభ్యులు అతి తక్కువగా హాజరయ్యారు. వ్యక్తిగత పనులపై చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఈ సమావేశాలకు హాజరుకాకపోవడతో వైస్ చైర్మన్ సత్యవతి అధ్యక్షత వహించారు. అయితే నాలుగు, ఏడో స్టాండింగ్ కమిటీ సమావేశాలకు కోరం లేకపోవడంలో గంటపాటు వేచి ఉండాల్సి వచ్చింది. సభ్యులకు ఫోన్ చేసి వేగంగా రావాలని జడ్పీ సిబ్బంది విజ్ఞప్తి చేశారు. సభ్యులంతా ఎమ్మెల్యేలు/సమన్వకర్తల వెంట ఎన్నికలు ప్రచారంలో ఉన్నారంటున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు జీతాల బడ్జెట్ విడుదల

» సమ్మె కాల వేతనాలకు మొండిచేయి

కంచరపాలెం, మార్చి 12 : సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాల బడ్జెట్‌ను రాష్ట్ర కార్యాలయం మంగళవారం విడుదలచేసింది. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వెలువడిన రోజే ఈ జీతాల బడ్జెట్‌ను విడుదల కావడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గత సెప్టెంబరు నెలనుంచి సమగ్ర శిక్షా ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యంలో గత డిసెంబరు నెల 20వ తేదీ నుంచిజనవరి 12వ తేదీ వరకు నిరవధిక సమ్మెను కొనసాగించారు. దీంతో ప్రభుత్వం చర్చలు సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. కానీ, వేతనాల బకాయిలు చెల్లించడంలేదు. ఈ స్థితిలో ఉద్యమ బాటకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జీతాల బడ్జెట్‌ను మాత్రం మంగళవారం జిల్లా కార్యాలయాలకు పంపిస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. అ యితే, తమ సమ్మెకాలపు జీతాలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరసన తెలిపితేనే వేతనా లు?

సర్వ శిక్షా ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు 60 శాతం కేంద్ర ప్రభుత్వం ముందే విడుదల చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం సదరు నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తోంది. దీంతో కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఇకనైనా సకాలంలో వేతనాలుచెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం దృష్టికి మహిళా బ్యాంకు ఏర్పాటు

» రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

సిరిపురం, మార్చి 12: విశాఖ బీచ్‌రోడ్డు శుభ్రంగాగా ఉండేందుకు కృషి చేసిన చైతన్యస్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని, మహిళా బ్యాంకు ఏర్పాటుపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురజాడ కళాక్షేత్రంలో మంగళవారం చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా గృహలక్ష్మి మ్యూచువల్లీ కో ఆపరేటివ్ ఎయిడెడ్ సొసైటీ సభ్యుల సమావేశాన్ని, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రెహమాన్, డాక్టర్ శిరీన్‌రెహమాన్ మహోన్నతమైన ఆశయంతో ఏర్పాటు చేసిన సంస్థ మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. 2006లో ప్రారంభించిన సొసైటీ రెండున్నర కోట్ల టర్నోవర్ సాధించడం అభినందనీయమన్నారు. ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ చైతన్యస్రవంతి దశాబ్దాలుగా చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఎ.రెహమాన్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చైతన్యస్రవంతి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైతన్యస్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రెహమాన్ మాట్లాడుతూ మహిళల కోసం బ్యాంకు పెడితే బాగుంటుందన్నారు. అనంతరం మహిళా గ్రూపులకు డివిడెండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఫణిప్రకాష్, చైతన్యస్రవంతి కార్యదర్శి అశోకకుమారి, మాజీ వీసీ లజపతిరాయ్, యూసీడీ పీడీ కేవీ పాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

17 మద్యం సీసాలు స్వాధీనం, ఇద్దరి అరెస్టు

పరవాడ, మార్చి 12: మండలంలోని తానాం గ్రామానికి చెందిన డి.అప్పలరాజు నుంచి పది మద్యం సీసాలు, నాయుడుపాలెం పంచాయతీ పరిధి కొండవానిపాలెం గ్రామానికి చెందిన పి.అప్పారావు నుంచి ఏడు మద్యం సీసాలను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నటు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

మహిళ హత్య కేసులో కోడలు అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 12: కొత్తూరు పంచాయతీ పరిధిలోని దేవీనగర్‌లో సోమవారం జరిగిన సింహాద్రమ్మ హత్య కేసులో నిందితురాలైన ఆమె కోడలు పూర్ణను మంగళవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. దేవీనగర్‌కు చెందిన ఈగల సింహాద్రమ్మ, ఆమె కోడలు పూర్ణ సోమవారం ఉదయం గొడవపడి, రుబ్బురోలు సన్నిగొడ్డతో తల, ముఖంపైన బలంగా మోదడంతో అత్త మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై మృతురాలి భర్త సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు పూర్ణను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ప్రశాంత ఎన్నికలే ధ్యేయం: సీఐ

పద్మనాభం (రూరల్‌), మార్చి 12: రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా గ్రామాల్లో సాయిధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని సీఐ సీహెచ్‌ శ్రీధర్‌ తెలిపారు. మంగళవారం అయన విలేకరులతో మాట్లాడారు. పొట్నూరు. రెడ్డిపల్లి, రేవిడి, కురపల్లి, పాండ్రంగి గ్రామాల్లో బీఎస్‌ఎఫ్‌, సీఐఎస్‌ఎఫ్‌ సాయిధ బలగాల కవాతు పూర్తిచేసినట్టు చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నిత్యం పోలీసు గస్తీ కొనసాగిస్తున్నట్టు వివరించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

పద్మనాభం(రూరల్‌), మార్చి 12: వేతనాలు చెల్లించాలని కోరుతూ, మండలంలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి వేతనాలు ఇంతవరకు రాలేదన్నారు. కుటుంబాలతో గడవడం కష్టంగా ఉందన్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రమిచ్చారు. సర్వశిక్ష ఉద్యోగసంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు రావాలి

పద్మనాభం, మార్చి 12: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ కె.రాంబాబు చెప్పారు.స్థానిక ఎంఆర్‌సీలో జెడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులపై ఒత్తిడి పెంచకుండా బోధించాలన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. ఎంఈఓ-1 రమణ. కేజీబీవీ ప్రిన్సిపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, మార్చి 12: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్‌ మొదటి సంవత్సరం బైపీసీలో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్‌ గంగా కుమారి తెలిపారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్‌ 11 వతేదీలోగా ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడిబయట తిరిగే చిన్నారులు, బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికలు అర్హులన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

భీమునిపట్నం, మార్చి 12: గర్భిణులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్‌ ప్రాజెక్టు సీడీపీవో ఎం.శ్రీదేవి తెలిపారు. ఎగువపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తల్లీబిడ్డలు ఆరోగ్యంగా వుండేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెయ్యి రోజుల పౌష్టికాహార పథకాన్ని అమలుచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ కె.ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.శాంతికుమారి, ఆర్‌.అచ్యుతాంబ, తల్లులు పాల్గొన్నారు.

చిప్పాడలో పశువైద్య శిబిరం

భీమునిపట్నం (రూరల్‌) మార్చి 12: మండలంలోని చిప్పాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి వి. రమావతి ప్రారంభించారు. పశుసంవర్థక శాఖ రీజినల్‌ డిప్యూటీ డైరెక్టర్‌ కరుణాకర్‌, భీమిలి సహాయ డైరెక్టర్‌ బి.వి.రమణ తదితరులు పాల్గొని మాట్లాడారు. భీమిలి పశువైద్యాధికారి డా. గ్లోరి ప్రశాంతి వైద్య పరీక్షలు చేశారు. 101 ఆవులు, 9 గేదెలు, 212 గొర్రెలు, 277 మేకలతో పాటు పెంపుడు కుక్కలు, కోళ్లు, పావురాలకు చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో దివీస్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ఎంవీపీ కాలనీ, మార్చి 12: ఆదర్శనగర్‌లో మంగళవారం గీతం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్‌ చారిటబుల్‌ ట్రస్టు సహకారంతో నిర్వహించిన శిబిరంలో 155 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్‌

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్‌, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్‌-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్‌, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మికాంత్‌ (గాజువాక), గణేష్‌ (తగరపువలస), నటరాజ్‌ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్‌ వాలెంటైన్‌ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మికాంత్‌ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్‌ :** లీలామహల్‌, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 14, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్‌ 24, క్యాబేజి 24, క్యారెట్‌ 25, దొండకాయలు 22, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 120, బరబాటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్‌ (పెన్సిల్‌) 52, ఆగాకర 52, పొటల్స్‌ 62, కీరదోస 28, కాప్సికమ్‌ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్‌)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్‌ ధరలు

బ్యాగ్‌

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్‌ స్కిన్‌	--	200
స్కిన్‌లెస్‌	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..

రోడ్లపైనే వాహనాలు... రాకపోకలకు అవస్థలు



రహదారులను మూసివేసి ఫంక్షన్లకు కార్పెట్లు వేసిన దృశ్యం



మద్దిలపాలెం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్‌

- ఫంక్షన్‌హాళ్లుగా మారుతున్న రహదారులు
- ప్రయాణాలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- జీవీఎంసీ 23వ వార్డులో నిత్యం ఇదే పరిస్థితి

మద్దిలపాలెం, మార్చి 12: జీవీఎంసీ 23వ వార్డులో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు. పైగా వాహనాల పార్కింగ్‌తో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి బార్‌ అండ్‌ రెస్టారెంట్‌కు ఆనుకుని ఉన్న రోడ్డులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ రోడ్డులో చివర గేటెడ్‌ కమ్యూనిటీ అపార్టమెంట్స్‌ ఉన్నాయి. దాదాపు 150 ఫ్లాట్‌లున్న అపార్ట్‌మెంట్‌కు ఇదే రహదారి. బార్‌ డౌన్‌లో కార్‌షెడ్‌లున్నాయి. ఇక్కడ రిపేర్లకు వచ్చే కార్లను రోడ్డుకు ఇరువైపులా పార్క్‌ చేస్తున్నారు. చిన్న రోడ్డు కావడం, కార్లు నిలిపివేస్తుండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గేటెడ్‌ కమ్యూనిటీ వాసులతో పాటు ఇతర అపార్ట్‌మెంట్‌ వాసులు కార్లలో తిరగడానికి నరకం చూస్తున్నారు. ఇక మద్దిలపాలెం బజార్‌ రోడ్డు పైపులైన్ల కోసం తవ్వారు. పనులు పూర్తి చేసి గోతులను వదిలేశారు. ఈ రోడ్డులోనూ రాకపోకలకు అవస్థలే. అంతేకాకుండా మద్దిలపాలెంలో పుట్టినరోజు, వివాహ వేడుకలకు ఇతర అవసరాలకు రహదారులను ఫంక్షన్‌ హాళ్లుగా మార్చేస్తున్నారు. చిన్న ఫంక్షన్‌ అయినా రోడ్డు మొత్తం టెంట్లు వేసి ఆక్రమిస్తున్నారు. ఆ సమయంలో వాహనదారులు ప్రయాణాలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క కార్‌ షెడ్లకు రిపేర్‌ వచ్చే వాహనాల పార్కింగ్‌, మరో పక్క ఫంక్షన్‌లతో నిండిపోయిన రహదారులపై నడిచివెళ్లేందుకు కూడా దారి లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్‌ పోలీసులు ఆక్రమణలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రయాణాలు సజావుగా సాగేలా అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలి

- ఎమ్మెల్యే వెలగపూడి, సతీమణి సుజన

ఆరిలోవ, మార్చి 12: రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కోరారు. జీవీఎంసీ 13వ వార్డు పార్టీ అధ్యక్షుడు పాత్రకండి ధర్మారావు ఆధ్వర్యంలో, యల్లమిల్లి సురేష్‌, నల్లాని వరలక్ష్మిలతో కలిసి మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ, జేఎన్‌ఎన్‌ఆర్‌ కాలనీల్లో వెలగపూడికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వెలగపూడి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీని వివరించారు. సైకో జగన్‌ని గద్దెదింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, ముగడ రాజారావు కనకరాజు, భైరవీడు, జక్కన్న, నూర్జహాన్‌, వడిసెల శ్రీను, సోనాపురం సుధాకర్‌, తదితరులు పాల్గొన్నారు.



వెలగపూడికి హారతులు ఇస్తున్న మహిళలు

ఎంవీపీ కాలనీ: ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికే ఓటు వేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సతీమణి సుజన ఓటర్లను కోరారు. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులో ఆమె తెలుగుదేశం తరపున ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబు అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారన్న విషయం మీకు తెలిసిందేనని, నాలుగోసారి కూడా తెలుగుదేశం పార్టీకి ఓటేసి ఆయనను గెలిపించాలని కోరారు. సూపర్‌ సిక్స్‌ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమెతో పాటు మహిళలు పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వెలగపూడి సతీమణి సుజన

చిట్టివలసలో ఏబీవీపీ మహాసభలు ప్రారంభం



చిట్టివలసలో ఏబీవీపీ మహాసభలను ప్రారంభిస్తున్న నాయకులు

తగరపువలస, మార్చి 12: విద్యా సంబంధిత పరిష్కారానికి విద్యార్థులంతా ముందుకు రావాలని ఏబీవీపీ రాష్ట్ర కమిటీ నాయకులు గుడిపాటి సుబ్బారావు అన్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్తు (ఏబీవీపీ) మహాసభలు మంగళవారం చిట్టివలస బొగ్గురోడ్డు ఎస్‌.ఆర్‌.ఎస్‌. కల్యాణ మండపంలో రాష్ట్ర సమితి సభ్యులు లొడగల అచ్చిబాబు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలు చాలా పెండింగులో ఉండిపోయాయని, వీటిని పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ జిల్లా ప్రచార ప్రముఖ్‌ తమ్మిన నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకొని, జాతీయ పునర్నిర్మాణ దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సురవరసు సాయికుమార్‌, లీలాశంకర్‌, నితీన్‌, వెంకటేష్‌, అహషేక్‌, చరణ్‌ దినేష్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం ప్రముఖుల ప్రసంగాలు సాగాయి.

పెదగదిలిలో విగ్రహ ఏర్పాటుపై వివాదం



రంగా విగ్రహం ఏర్పాటుకు పార్కులో తొలగించిన ఐరన్‌ ఫ్రేమ్‌లు

ఆరిలోవ, మార్చి 12: పెదగదిలి జంక్షన్‌లోవాటర్‌ ఫౌంటెయిన్‌ వెనుకనున్న పార్కులో వంగవీటి మోహన్‌ రంగా విగ్రహాన్ని ఏర్పాటుకు కొంతమంది కాపునాయకులు సోమవారం రాత్రి ఏర్పాటుకు ప్రయత్నించారు. పార్కు చుట్టూ ఉన్న కంచెను తొలగించి నాలుగు అడుగు మేర గోతిని తీసి సిమెంట్‌ స్తంభాలు, ఇనుప ఊచలు వేశారు. ఇది తెలుసుకున్న స్థానికులు వచ్చి అభ్యంతరం వ్యక్తంచేశారు. వెంటనే జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో సిబ్బంది వచ్చి పనులు నిలిపివేయించారు. ఊచలు తొలగించారు. గతంలో ఇదే ప్రాంతంలో అంబేద్కర్‌ విగ్రహం ఏర్పాటుకు కోరినా, బీఆర్‌టీఎస్‌ రోడ్డు కావడంతో అధికారులు నిరాకరించినట్టు నేతలు కృష్ణ తదితరుల తెలిపారు. సంబంధిత కార్పొరేటర్‌ అక్కరమాని రోహిణి కూడా అక్కడకు వచ్చి కాపు నాయకులకు సర్దిచెప్పడంతో సమస్య పరిష్కారమైంది.

పాఠశాలల పనితీరుపై సామాజిక తనిఖీలు

- జిల్లా ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్‌



పాఠశాల ప్రధానోపాధ్యాయులతో చర్చిస్తున్న డిప్యూటీ డీఈవో గౌరీశంకర్‌

పద్మనాభం, మార్చి 12: జడ్పీ ఉన్నత పాఠశాలల పనితీరుపై సామాజిక తనిఖీలు నిర్వహించానని జిల్లా ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్‌ చెప్పారు. మండలంలోని ఆర్‌వీ పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు పాఠశాల పనితీరు మూల్యాంకనంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో విద్యాపరంగా, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌వీ పురం పాఠశాలలో విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధికి ఎఫ్‌ఎస్‌ఈ ప్రాజెక్టు విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నోడల్‌ అధికారి మహేశ్‌, జిల్లా కామన్‌ పరీక్షల విభాగం కార్యదర్శి కృష్ణకుమార్‌. ఎంఈఓ-1 రమణ, హెచ్‌ఎంలు శంకరరావు, అప్పలరాజు, రీసోర్సు పర్సన్లు సత్యారావు, సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ'పై విస్తృత ప్రచారం



భీమిలిలో సూపర్‌ సిక్స్‌ పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

భీమునిపట్నం, మార్చి 12: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు రూపొందించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పార్టీ శ్రేణులు ఇంటింటికీ పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో ఎగువపేటలో సూపర్‌ సిక్స్‌ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పుక్కళ్ల లక్ష్మీకుమారి, పైడిపల్లి నరసింగరావు, మట్టా కొండ, పీరుపల్లి రాజు, వాసుపల్లి వంశీ, మట్టా దాసు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం (రూరల్‌): మండలంలోని అనంతవరం, గొల్లలపాలెంల్లో మంగళవారం టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్‌ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. ఆంజనేయస్వామికి పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ. జనసేన. బీజేపీ పార్టీలు బలపరిచిన అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాళ్ల నగేష్‌కుమార్‌, ఎస్‌.రమణమ్మ, వెంకటరావు, అప్పల సూర్యనారాయణ, తాతాజీ, అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం: సీఎం రమేశ్‌



సీఎం రమేష్‌ను సత్కరిస్తున్న పీతల మూర్తియాదవ్‌

పెదవాల్తేరు మార్చి 12: ఉత్తరాంధ్ర అభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పని చేయాలని బీజేపీ నాయకుడు సీఎం రమేశ్‌ పిలుపునిచ్చారు. నగర బీజేపీ కార్యాలయంలో మంగళవారం 22వ వార్డు జనసేన కార్పొరేటర్‌ పీతల మూర్తియాదవ్‌ మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యచరణపై చర్చించారు.

ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి

కొమ్మాది: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలింపించడమే లక్ష్యమని నాయకులు అన్నారు. ఆరోవార్డు టి.డి.పి అధ్యక్షుడు దాసరిశ్రీనివాస్‌ ఆధ్వర్యంలో మూడు పార్టీల నేతలు మంగళవారం సమావేశమయ్యారు. అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా గెలిపించి తీరాలని తీర్మానం చేశారు. టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్‌, జనసేన జిల్లా అధ్యక్షుడు ఈఎన్‌ఎస్‌ చంద్రరావు, జనసేన నేత సంతోష్‌నాయడు, అపార్టుమెంట్ల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

గీతంలో కృత్రిమ మేధపై సదస్సు



జ్ఞాపికను అందుకుంటున్న డాక్టర్‌ రామరాజు

సాగర్‌నగర్‌, మార్చి 12: గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ కంప్యూటర్‌ సైన్స్‌ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధపై ప్రత్యేక సదస్సును మంగళవారం నిర్వహించారు. క్యాప్‌జెమినీ సంస్థ సీనియర్‌ మేనేజర్‌ డాక్టర్‌ పూసపాటిరామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని కృత్రిమ మేధ ప్రస్తుతం అనేక రంగాలపై ప్రభావం చూపుతోందని ఆయన తెలిపారు. కృత్రిమ మేధ విధానం, ఉపయోగాలు, చాట్‌ జీపీటీని వివరించారు. కంప్యూటర్‌ సైన్స్‌ విభాగం అధిపతి ప్రొఫెసర్‌ టి.ఉమాదేవి ఆధ్వర్యంలో కృత్రిమ మేధ ద్వారా భవిష్యత్తులో పెరగనున్న ఉపాధి అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్‌ ఎం.సురేష్‌కుమార్‌ తదితర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌ చార్జీలపై ఎమ్మెల్యేను నిలదీసిన జనం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది, మార్చి 12: సంక్షేమ పథకాలు సరే పెరుగుతున్న కరెంటు బిల్లులు, నిత్యావసర సరకుల ధరలతో ఎలా బతకాలి అంటూ మహిళలు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును నిలదీశారు. మారికవలస యాతపాలెం రాజీవ్‌గృహకల్పకాలనీల్లో మంగళవారం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలపై ఏకరువు పెడుతుండగా ఓ మహిళ షాక్‌ ఇచ్చింది. సంక్షేమ పథకాలతో ఉపయోగమేంటని నిలదీసింది. కరెంటు బిల్లులు, నిత్యావసర సరకుల ధరలతో బతకలేని పరిస్థితులున్నాయని వాపోయింది. ఆమెతో పాటు మరింత మంది మహిళలు సమస్యలపై ప్రశ్నించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, దోమల బెడద పెరిగిందని, నడవడానికి కూడా వీలులేని స్థితిలో ంనరోడ్లు ఉన్నాయని, వీటిని పట్టించుకోకుండా పథకాలు ఇస్తే సరిపోతుందా అని నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

ఘనంగా రంజాన్‌ వేడుకలు



ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెం, మార్చి 12: జీవీఎంసీ 22వ వార్డు తారామసీదులో మంగళవారం రంజాన్‌ మాసం ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలతో ఇఫ్తార్‌ విందు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అల్లాకు ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పారావు, కోడిబోయిన ఆనంద్‌, దువ్వి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం(రూరల్‌): మానవళి సంక్షేమమే రంజాన్‌ దీక్షల పరమావధి అని ఏఎంసీ మాజీ వైస్‌ ఛైర్మన్‌ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు అన్నారు. అనంతవరంలో ఉపవాస దీక్షలకు ఉపక్రమించిన ముస్లింకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తి శ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలు ప్రార్థనలు, దాన, ధార్మిక కార్యక్రమాలు విజయవంతం కావాలని అయన ఆకాక్షించారు.

చిలకలూరిపేట సభ కమిటీలో జిల్లా నేతలకు చోటు

ఎంవీపీ కాలనీ, మార్చి 12: చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ నెల 17న నిర్వహించనున్న టీడీపీ, జనసేన, బీజేపీ బహిరంగ సభ విజయవంతం కోసం ఏర్పాటుచేసిన కమిటీలో జిల్లా వాసులకు చోటు లభించింది. ప్రధాని మోదీ పాల్గొనే సభకు వలంటీర్ల సమన్వయ కమిటీలో టీఎన్‌ఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్‌గోపాల్‌, జనసేన పార్టీకి చెందిన బి.శివదత్‌లను నియమించారు. వీరు మంగళగిరిలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



పండ్లు పంపిణీ చేస్తున్న బొత్స ఝాన్సీ

వెంకోజీపాలెం, మార్చి 12: వైసీపీ 14వ వార్షికోత్సవం 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో మంగళవారం ఘనంగా జరిగింది. పార్టీ విశా ఖ పార్లమెంట్‌ అభ్యర్థిని బొత్స ఝాన్సీ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండాను ఎగురవేసి, కేక్‌ కట్‌ చేశారు. పండ్లు, బిస్కెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నడింపల్లి కృష్ణంరాజు, సూరిశెట్టి సన్యాసిరావు, మరియదాసు పాల్గొన్నారు.

ఎండాడ: వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎండాడ జిల్లా కార్యాలయంలో మంగళవారం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి: ఏసీపీ

సాగర్‌నగర్‌, మార్చి 12: ప్రతి ఒక్కరు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని జోన్‌-1 ట్రాఫిక్‌ ఏసీపీ ప్రసాద్‌ అన్నారు.మంగళవారం గాయత్రీ విద్యాపరిషత్‌ డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్‌ కళాశాల ఆడిటోరియంలో ట్రాఫిక్‌ నిబంధనలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వాహన నడిపేసమయంలో హెల్మెట్‌ ధరించాలన్నారు. కారులో సీట్‌ బెల్ట్‌ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. విద్యాదశ నుంచి ట్రాఫిక్‌ నిబంధనలు పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరిలోవ ట్రాఫిక్‌ ఎస్‌ఐ శ్రీకాంత్‌, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న పాశర్ల ప్రసాద్‌



పీసీసీ చీఫ్‌ షర్మిలతో పాశర్ల దంపతులు

సింహాచలం, మార్చి 12: టీడీపీకి రాజీనామా చేసిన పాశర్ల ప్రసాద్‌ కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ మేరకు పాశర్ల దంపతులు సోమవారం లోటస్‌ పాండ్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిశారు. వారు పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షులు గొంప గోవింద్‌ ఒకప్రకటనలో తెలిపారు.


అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వామికి తులసి దళార్చన చేస్తున్న దృశ్యం

సింహాచలం, మార్చి 12: వరాహలక్ష్మీనృసింహ స్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. వాటిలో భాగంగా సోమవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తొలుత నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీదళాలతో అర్చన జరిపారు. అనంతరం ఆగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్య ధారణలు జరిపి అక్షితారోపణ (తలంబ్రాలు) కావించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మహాత్మా గాంధీ పోరాటం స్ఫూర్తిదాయకం



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భీమునిపట్నం, మార్చి 12: స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మాగాంధీ పోరాట పటిమ ఆదర్శమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించి 94 ఏళ్ల పూర్తయిన సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులో సమావేశం నిర్వహించారు. బ్రిటీష్‌ పాలకులపై మహాత్మా గాంధీజీ పోరాటాన్ని వివరించారు. ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షులు కేఎస్‌ఆర్‌ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారోజు సంజీవ్‌కుమార్‌, కనకల అప్పలనాయుడు, అప్పికొండ నూకరాజు, వియ్యపు పోతురాజు, విద్యార్థులు పాల్గొన్నారు.